క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

వడమాలపేట: మండల కేంద్రంలోని వడమాలపేట బస్టాండ్ నందు మండల బహుజనసేవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌ఐ రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు తాగునీటికి ఇబ్బంది పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత సమాజసేవలో భాగం కావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దిలీప్, గౌరవ అధ్యక్షుడు మునస్వామి, ఉపాధ్యక్షుడు ఉదయ్, సభ్యులు భాను, సుబ్రమణ్యం, భూపతి, మురళీ, మోహన్, సాయి పాల్గొన్నారు.

నేడు నియామక పత్రాల అందజేత

పుత్తూరు రూరల్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులకు మంగళవారం పర్యటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు ప్రిన్సిపల్ ఎస్‌వీ కుమార్, పీఆర్‌ఓ ఆనందరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'ఉద్యోగ సాధకుల దినోత్సవం' సందర్భంగా ఉదయం 10 గంటలకు 50 మంది విద్యార్థులకు నియామక పత్రాలను అందిస్తారని చెప్పారు.

80 శాతం పింఛన్ పంపిణీ పూర్తి


శ్రీకావేరిరాజుపురంలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

పాలసముద్రం: మండలంలోని ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్ పంపిణీ మొదటి రోజే సోమవారం 80 శాతం పింఛన్ పంపిణీ చేశామని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. మండల పరిధిలోని తొమ్మిది గ్రామ సచివాలయాల పరిధిలో 3,699 మందికి ప్రభుత్వం పలు రకాల పింఛన్లు అందిస్తోంది. మొదటి రోజు 2,950 మందికి పింఛన్ అందించారు.

ప్రదోషకాల పూజలు రేపు

వెదురుకుప్పం: అరుణగిరిలో కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషే పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బస్టాండ్‌లో జోరుగా సర్వే


దుకాణాలను తొలగించడానికి సర్వే చేస్తున్న ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో అధికారులు జోరుగా సర్వే చేస్తున్నారు. త్వరలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి నేరుగా తిరుపతి బస్టాండ్‌లోకి ఆర్టీసీ సర్వీసులు చేరుకోనున్నాయి. రామానుజ సర్కిల్ వద్ద ఫ్లై ఓవర్ పనులు పూర్తయిన వెంటనే బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సర్వీసులకు అడ్డుగా పడమర వైపు ఉన్న 10 దుకాణాలను తొలగించడానికి ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేపట్టారు. అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నేత తులసీరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బ్యాంకులు, ఏటీఎంలు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగులతోపాటు వివిధ సమస్యలపై వచ్చే ప్రజల సౌకర్యం కోసం బ్యాంకులు, ఏటీఎంలు ఏర్పాటు చేస్తున్నారు. వారం రోజుల్లో సేవలు అందుబాటులోకి రానున్నాయి.

రుయా కార్మికులకు కిట్ల పంపిణీ


కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తిరుపతి తుడా: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి రుయా పారిశుద్ధ్య కార్మికులకు హైజీన్ కిట్లను పంపిణీ చేశారు. రుయాలో సోమవారం కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రుయా సీఎస్ ఆర్‌ఎంవో లక్ష్మానాయక్, ఏఆర్‌ఎంఓ యువ అన్వేష్ రెడ్డి కిట్లు అందజేశారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ వి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు కిట్లు పంపిణీ చేశామని చెప్పారు. రెడ్ క్రాస్ సభ్యులు జీ. సుదర్శన రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల రక్షణకు శ్రీకారం

- జిల్లా పరిషత్ హైస్కూళ్ల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు
- స్కూళ్ల భద్రత కోసం నైట్ వాచ్‌మెన్ల ఏర్పాటు
- నేటి నుంచి విధుల్లోకి హాజరు కానున్న వాచ్‌మెన్లు



తడుకుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

నగరి: గత పాలనలో పాడుబడిన దశలో ఉన్న పాఠశాలలను నేడు కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించడంతో పాటు పాఠశాలకు సంబంధించిన ఆస్తులు, వస్తువుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మెన్ నియామకానికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల మేరకు నేటి నుంచి వాచ్‌మెన్‌లు బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ హైస్కూళ్లకు ఏళ్ల తరబడి నైట్ వాచ్‌మెన్ లేరు. దీంతో పలు హైస్కూళ్లలో ఎన్నోసార్లు చోరీలు జరిగాయి. కంప్యూటర్లు, ఇతర విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయి. సరస్వతీ నిలయాలైన స్కూళ్లలో రాత్రిపూట మందుబాబులు, జూదరుల అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మార్చేస్తున్నారు. మద్యం మత్తులో ఆకతాయిలు ఆస్తులను, ఫర్నీచర్‌ను ధ్వంసం చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఇవే గాకుండా పాఠశాలల ఆవరణల్లోకి పశువులు చొరబడి నీడనిచ్చే మొక్కలు, చెట్లను ధ్వంసం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి మౌనంగా భరించారు. సెలవు రోజుల్లో సైతం హైస్కూళ్లకు వచ్చి పరిస్థితి గమనించి వెళ్లే హెచ్‌ఎంలు చాలా మందే ఉన్నారు. నగరి మండలంలోని తడుకుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కంప్యూటర్‌ను అపహరించుకుపోయారు. ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైట్లు చోరీకి గురయ్యాయి. ఎస్‌జీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణ సామగ్రి అపహరణకు గురైంది. ఇలా ఉన్నత పాఠశాలల్లో చోరీలకు సంబంధించి నాలుగు కేసులు నగరి స్టేషన్‌లో నమోదయ్యాయి.

స్థానికులకే ప్రాధాన్యం

జిల్లా పరిషత్ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌లను నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై ప్రధానోపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.6,000 గౌరవ వేతనంతో నియమించే వాచ్‌మెన్ పోస్టు భర్తీకి సంబంధించి అదే హైస్కూల్లో పనిచేసే ఆయా భర్తకు గానీ, వంట చేసే మహిళ భర్తకు గానీ తొలి ప్రాధాన్యం ఇస్తారు. లేకుంటే 60 ఏళ్ల లోపు వయసున్న స్థానిక ఎక్స్ సర్వీస్‌మెన్, పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని గానీ నియమించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ షరతుల ప్రకారం ఎంఈఓ, హెచ్‌ఎం ప్రస్తుతం తమ హైస్కూళ్లకు నమ్మకంగా పనిచేసే వాచ్‌మెన్‌లను నియమించుకోగా, నేటి నుంచి వారు బాధ్యతలు స్వీకరించి పనిలో నిమగ్నమయ్యారు.

నియోజకవర్గంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు

మండలం	పాఠశాలలు
నగరి	12
పుత్తూరు	13
నింద్ర	5
వడమాలపేట	6
విజయపురం	5
మొత్తం	41

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం



జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం. గతంలో పలుమార్లు ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో అన్ని ఉన్నత పాఠశాలలకు వాచ్‌మెన్‌లు నియమించబడి బాధ్యతలు స్వీకరించారు.

– శ్రీదేవి, ఎంఈఓ, నగరి

పోషకాహారంపై గర్భిణులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కల్యాణి

నింద్ర: కౌమార దశ కలిగిన ఆడపిల్లలకు ప్రతినెల హెచ్‌బీ నమోదు చేస్తూ వారి ఆరోగ్య స్థితిని అంచనా వేయాలని, అలాగే వారు మంచి పోషకాహారం తీసుకుంటే అనీమియా రాకుండా నియంత్రించవచ్చని డాక్టర్ కల్యాణి అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఏఎన్‌ఎంలకు స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని సూచనలు అందజేశారు. అదేవిధంగా గర్భిణులకు ప్రతినెల హెచ్‌బీ టెస్టు చేసి వారి, ఆరోగ్య స్థితిని మెరుగుపరిచే విధంగా చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు 0–5 ఏళ్ల పిల్లల్లో బర్త్ వెయిట్ లేకుండా చూసుకోవాలన్నారు. పిల్లల్లో ఐరన్ ఫోలిక్ సిరప్‌ను వారంలో రెండు రోజులు ఇవ్వాలన్నారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించడం వల్ల వాళ్లలో రక్తహీనత రాకుండా చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గోపీ, సీహెచ్‌ఓ శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ, ఆరోగ్య పర్యవేక్షకులు సురేష్, మల్లికాంబ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన జడ్జిలు


విజయ్‌సారథిరాజు, సునీతరాణి

తిరుపతి లీగల్ : తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జిలు డి.విజయసారథిరాజు, ఎ.సునీత రాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. జడ్జి విజయసారథిరాజు గుంటూరు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ బదిలీ అయ్యారు. అలాగే జడ్జి ఎ.సునీతరాణి గుంటూరు 5వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు.

ఆర్‌ఎంపీ భూకబ్జాలపై చర్యలు తీసుకోండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఆర్‌ఎంపీ ముసుగులో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న సుధారాణిపై చర్యలు తీసుకోవాలని చంద్రగిరి బజారు వీధి ద్రౌపది సమేత ధర్మరాజుల గుడి ధర్మకర్త విరూపాక్షి శంకర్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం స్పందనలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. చంద్రగిరి సర్వే నెంబర్ 161లో సుధారాణి భారీగా భూకబ్జాలకు పాల్పడినట్టు తెలిపారు. 12 సెంట్ల కాలువ పొరంబోకును ఆక్రమించి రెండు ఇళ్లు నిర్మించినట్లు చెప్పారు. మహాభారతం నాటకం ప్రదర్శన కోసం కేటాయించిన స్థలాన్ని, సమావేశ మందిరం నిర్మించనున్న భూమిని కబ్జా చేయాలని దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. స్పందించిన డీటీ ఈశ్వర్‌రెడ్డి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కోటి పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత


పెన్షన్ అందజేస్తున్న జీజ

నగరి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ప్రజలకు సేవలు అందించడంలో ముందంజలో ఉంది. లబ్ధిదారులు ఎక్కడ ఉన్నా వెతుక్కుంటూ వెళ్లి మరీ వారికి పథకాలను అందజేస్తున్నారు. ప్రతి నెల 1వ తేదీన ప్రతి ఇంటికి తలుపు తట్టి మరీ పెన్షన్ అందజేస్తున్నారు. ముడిపల్లి గ్రామానికి చెందిన అమాసయ్య స్విమ్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని అక్కడే ఉన్నాన్నాడు. డప్పు కళాకారుడైన ఇతనికి పెన్షన్ నగదు చాలా అవసరం కావడంతో వలంటీర్ జీజ తిరుపతి స్విమ్స్‌కు వెళ్లి ఆస్పత్రిలోనే అమాసయ్యకు పెన్షన్ అందజేసింది. ఏ ప్రభుత్వం ఇంతలా సాయం అందించలేదని అమాసయ్య కృతజ్ఞతలు తెలిపాడు.

ఇద్దరు దొంగలకు జైలు

తిరుపతి లీగల్ : తిరుమలలో భక్తుల జేబుల నుంచి సొమ్మును అపహరించిన కేసులో ఇద్దరికి 3 నెలల జైలు శిక్ష, రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. తమిళనాడుకు చెందిన పీసీ రమేష్‌కుమార్, తిరుపతి జబ్బార్ లేఅవుట్‌కు చెందిన ఆర్.రాజకుమార్ చోరీకి పాల్పడగా తిరుమల వన్‌టౌన్ పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

వైభవంగా అగస్త్యేశ్వరుడి రథోత్సవం


రథోత్సవంలో అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో సోమవారం రాత్రి ఉత్సవమూర్తులు రథోత్సవంలో భక్తులను అనుగ్రహించారు. ఆలయానికి చెక్క రథం లేకపోవడంతో సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులకు రథోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య కైంకర్యాలను పూర్తి చేశారు. ఉదయం 10.30 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, జమేదార్ విజయకుమార్ తదితరులు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో మంగళవారం సాయంత్రం మరగదవల్లీ, అగస్త్యేశ్వరస్వామికి నిర్వహించే ఆర్జిత కల్యాణంలో రూ 500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చని, అలాగే రాత్రి అశ్వవాహన సేవలో ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తామని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

నువ్వుల సాగుపై అవగాహన

సత్యవేడు: నువ్వులు వైఎల్‌ఎం–66 రకం విత్తనాలతో సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు తిరుమల రెడ్డి, భారతి తెలిపారు. సోమవారం మండలంలో ఏఎంపుం సచివాలయ పరిధిలోని రైతులకు వైఎల్‌ఎం 66 నూతన వంగడం నువ్వుల సాగుపై అవగాహన కల్పించారు. 42 మంది రైతులకు విత్తనాలు ఉచితంగా అందజేశారు. వెంకటరాజుల కండ్రిగలో సాగు చేస్తున్న నువ్వుల పంటలను పరిశీలించారు. ఎకరాలకు రెండు కేజీల విత్తనంతో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చన్నారు. వరి కోతల తరువాత పొలాలను రైతులు బీళ్లుగా వదిలేయకుండా దుక్కి దున్ని అదే తేమతో వైఎల్‌ఎం రకం నువ్వుల విత్తనాలు చల్లడం వల్ల పంటసాగుతో అదనపు ఆదాయం పొందవచ్చన్నారు.

పశువుల కంటైనర్ సీజ్

చంద్రగిరి(తిరుపతి రూరల్): నెల్లూరు నుంచి తమిళనాడుకు పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను చంద్రగిరి పోలీసులు సీజ్ చేశారు. చంద్రగిరి మండలం గాదంకి టోల్ ప్లాజా సమీపంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నెల్లూరు నుంచి తమిళనాడు రాష్ట్రంలోని పొల్లాచ్చికి వెళ్తున్న భారీ కంటైనర్‌ను తెరిచి చూశారు. అందులో 34 పశువులను ఇరుకుఇరుకుగా కుక్కినట్టు ఎస్‌ఐ వంశీకృష్ణ గమనించారు. అనుమతులు, పత్రాలు లేకుండా పశువులను తరలిస్తున్నట్లు గుర్తించి డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. కంటైనర్‌ను స్టేషన్‌కు తరలించారు. పశువులను తిరుచానూరులోని గోశాలకు తరలించారు.

ప్రసన్న వేంకటేశ్వరుడి సేవలో మంత్రి రోజా


ఆలయం వెలుపుల మంత్రి రోజా

వడమాలపేట: మండల పరిధిలోని అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ యాదవేంద్ర రెడ్డి, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కిరణ్, నగరి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ శేషాద్రిరెడ్డి, ఎంపీటీసీ రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, అయ్యప్పరెడ్డి, ఆలయ సిబ్బంది సాయి తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం వేకువజామునే స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కార్మిక లోకానికి అండగా ప్రభుత్వం

- కార్మికుల పిల్లలకు విద్య, వైద్య సదుపాయం కల్పిస్తున్నాం
- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి
- నియోజకవర్గవ్యాప్తంగా మే డే వేడుకలు


నగరి: మే డే వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: రాష్ట్రప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉంటోందని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. సోమవారం మే డేను పురస్కరించుకుని మున్సిపల్ ఏఐటీయూసీ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన మే డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వం విద్యను అందిస్తోందన్నారు. బైజూస్ కంటెంట్‌తో ఇంగ్లిష్ మీడియం విద్య పేద కార్మికుల పిల్లలకు కూడా నేడు అందుతోందన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, చేయూత, ఆసరా తదితర సంక్షేమ పథకాలు వారిని ఆదుకుంటున్నాయని తెలిపారు. ఆటో కార్మికులను వాహన మిత్ర ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. అసంఘటిత కార్మికులకు వైఎస్సార్ బీమా సౌకర్యం ఉందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ 137వ మే డేను ప్రస్తుతం జరుపుకుంటున్నామని అన్నారు. భారతదేశంలో తొలి మేడే 1923లో మద్రాస్ మెరీనా బీచ్‌లో జరిగిందని, నూరేళ్ల మే డే స్ఫూర్తితో కార్మికుల ఉన్నతికోసం పోరాడుతామన్నారు. మే డేను పురస్కరించుకుని కార్మికులు నగరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో, బస్టాండు ప్రాంగణంలోను జెండావిష్కరణ చేశారు. కార్యక్రమాల్లో ప్రభువ్వత ఆస్పత్రి వైద్యులు డాక్టర్ గోపాల్, ఏఐటీయూసీ పట్టణ నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, ఏరియా హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

పుత్తూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం కార్మిక పక్షపాతి అని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పయనీర్ స్పిన్నింగ్ మిల్లు వద్ద వైఎస్సార్ యూనియన్, గోపాల్‌రెడ్డి యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మే డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామ్‌ప్రసాద్‌రెడ్డి కార్మిక నాయకుడు గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మికులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, పార్టీ నాయకులు భరత్‌రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రసాద్, సుదర్శనం, అయ్యప్ప, చక్రి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కుల వేదిక ఆధ్వర్యంలో:

పుత్తూరు సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి ఆధ్వర్యంలో మే డేని పురస్కరించుకుని స్థానిక ధర్మరాజుల ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు రవీంద్ర యూనియన్ జెండా ఎగురవేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండల కేంద్రంలో ఏఐటీయూసీ, పారిశుద్ధ్య కార్మికులు, పాఠశాల ఆయా వర్కర్లతో కలిసి జీడీనెల్లూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మార్కండేయులు ఆధ్వర్యంలో మే డేని ఘనంగా జరుపుకున్నారు. అలాగే అమ్మపల్లి క్రాస్ వద్ద ఆటోయూనియన్ నాయకురాలు జయకుమారి ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నింద్రలో..

నింద్ర: మండల కేంద్రం నింద్రలోని ఆటో కార్మికులు, వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు కార్మికులకు స్వీట్లు అందజేశారు. నేతమ్స్ షుగర్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మే డే జరుపుకున్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: ఐకమత్యమే కార్మికుల బలమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణబాబు, ఎస్‌డీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మే డేని పాలసముద్రంలో మండల సీఐటీయూ అధ్యక్షుడు రవి కార్మికులతో కలిసి పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ట్రాక్టర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, డప్పు కళాకారుల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలకేంద్రంలో మే డేని వివిధ రంగాలకు చెందిన కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా రంగులు చల్లుకుంటూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని పిలుపునిచ్చారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: స్థానిక బస్టాండ్ కూడలిలో సోమవారం ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు పొన్నురంగం ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించారు.






సమాచార హక్కుల వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ, కార్వేటినగరం: అమ్మపల్లి క్రాస్ వద్ద, నింద్రలో.., సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా నాయకులు, జీడీనెల్లూరులో ..